
# అమలిన ప్రేమ

– కొఠారి వాణీచలపతిరావు



వాకిట్లో రథం ముగ్గు వేస్తోంది 'మానస.' సంక్రాంతి పండుగ ఇంకా నాలుగు రోజులే ఉంది. అందుకే ఆహడావుడి. రోజూ పొద్దున్నే లేచి రకరకాల ముగ్గులు వేయడం... అందులో రకరకాల రంగులు తీర్చిదిద్దటం అంటే ఆమెకు సరదా.

రథం అలా అలా పెరిగి పెద్దదైపోతున్నది.

ఇంతలో ఎక్కడి నుండి వచ్చాడో ఉదయ్ పిల్లిలా మెల్లిగా అడుగులో అడుగు వేస్తూ 'మానస' వెనక్కు వచ్చాడు. అదను చూసి 'మానస' చేతిలోని ముగ్గు గిన్నె అందుకని పరుగు పెట్టాడు.

ఊహించని ఈ హఠాత్ సంఘటనకు మానస బిత్తర పోయింది.

రథం మీద ఒలికిపోయిన ముగ్గు అక్కడక్కడ కుప్పలు కుప్పలుగా పడి అసహ్యంగా కనిపిస్తున్నది.

ఉదయ్ మీద మానసకు చెప్పలేనంత కోపం వచ్చి దాదాపు ఏడుపు గొంతులో "ఏయ్! ఉదయ్! ఏమిటిది? ఎందుకిలా చేసావ్?" అంది ఉక్రోషంగా

"రాత్రి రికార్డ్ బుక్‌లో 'ఫిగర్స్' వేసిపెట్టమంటే 'వెయ్యనుపో' అని పెద్ద పోజు కొట్టావు కదా! అందుకు శాస్తి" అన్నాడు ఉదయ్ చూపుడువేలును తమాషాగా ఊపుతూ.

"నీ రికార్డ్ బుక్‌లో నేనెందుకు ఫిగర్స్ వెయ్యాలి? నువ్వు వేసుకోలేవా?"

"ఎప్పుడూ వేసేదానివి నిన్నేమయింది? ఏదో ఆడ పిల్లవుకదా ముగ్గులు ముచ్చటగా వేస్తావు కదా.... ఆ చేత్తోటే నాలుగు జంతువుల్ని కూడా దించిపెడతావని అడిగాను. ఆ మాత్రానికే అంతటెక్కా?"

"అందుకని అందమైన రథం మీద ముగ్గు ఒలక బోసావా?"

"కావాలని ఒలకపోసానా? చెయ్యిజారింది గిన్నె లాక్కోవటంలో."

బయట జరుగుతున్న ఈ గొడవ చెవినబడ్డ మానస తల్లి రుక్మిణి 'అబ్బబ్బ! తెల్లవారిందా పోట్లాటకు' అంది తెచ్చిపెట్టుకున్న విసుగుతో.

"చూడమ్మా! ఉదయ్ నా ముగ్గు పాడుచేసాడు."

"చూడండి ఆంటీ! మానస ఫిగర్స్ వేసిపెట్ట మంటే వేసిపెట్టడం లేదు!"

వాకిట్లో తనకొడుకు చేసిన ఘనకార్యం చూసిన సావిత్రి "అయ్యయ్యో అదేం పనిరా ఉదయ్! బంగారం లాంటి ముగ్గుపాడుచేసావ్? నీ ఆగడాలు రోజురోజుకీ మరీ మితిమీరిపోతున్నాయ్. అమ్మాయ్ మానసా! ఇంకోసారి వాడు మీ గుమ్మంలో కాలుపెడితే కాళ్ళు విరగ్గొట్టు' అంది.

"ఎప్పుడో ఎందుకాంటీ! ఇప్పుడే విరగ్గొడతాను." అని చేతికందిన కర్రతీసుకుని ఉదయ్ వెంట బడింది మానస. వాళ్ళ అల్లరి చూసి రుక్మిణి, సావిత్రి ఇద్దరూ ముఖాముఖాలు చూసుకుని నవ్వు కున్నారు.

అది ఆ రోజు కొత్తకాదు.

'ఉదయ్', 'మానసా' నడకనేర్చినప్పటినుండి, మాట్లాడటం తెలిసినప్పటి నుండి ఇలా పోట్లాడు కుంటూనే ఉన్నారు.

అప్పుడు గోలీలాట, గుర్రమాట ఆడుకుంటే ఇప్పుడు చదరంగం క్యారమ్ ఆడుకుంటున్నారు. అంతే తేడా.

అది ఊరికి కాస్త దూరంగా ఉన్న ఒక కాలనీ. సిటీ వాతావరణానికి అంటే 'ఆ హడావుడీ, బిజీ, సందడీ'కి దూరంగా ఉన్న ఆ క్వార్టర్స్‌లో నివసించే వాళ్ళు ఒకరిళ్ళకు ఒకళ్ళు వెళ్తూ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తారు.

సావిత్రికి ఉదయ్ తర్వాత మళ్ళీ సంతానమే అందలేదు. రుక్మిణికి మొదటి కాన్పే గండమై మానస పుట్టుకతో మళ్ళీ కాన్పురాకుండా ఆపరేషన్ చేయించు కుంది.

పక్కపక్కనే ఉన్న 'క్వార్టర్స్'ను కొనుక్కొని ఇరవై యేళ్ళుగా ఆ రెండు కుటుంబాలు అక్కడే ఎంతో సన్నిహితంగా ఉంటున్నాయి.

"చూస్తూ చూస్తూనే వీళ్ళు ఎంతగా ఎదిగిపోయారు. మేం కొత్తగా ఈ ఇంట్లోకి వచ్చినప్పుడు మీ మానస ఆర్నెల్ల పిల్ల" అంది సావిత్రి.

"మీ 'ఉదయ్' మూడేళ్ళ వాడనుకుంటాను. ముద్దుముద్దు మాటలతో బొద్దుగా భలే ముద్దొచ్చేవాడు" అంది రుక్మిణి. అలా వాళ్ళ చిన్నతనాన్ని మురిపెంగా చెప్పుకుంటారు వాళ్ళు. కొత్త అందాలను, ఆకర్షణలను సంతరించుకుంటూ మిసమిసలాడే యవ్వనంలో ఆవేశం, చైతన్యం ఆ వయసుకు అందం అన్నట్లు సందడిగా మెలిగే ఆ ఇద్దరినీ చూస్తుంటే వాళ్ళలో ఈ మధ్య కొత్త ఊహలు మెదులుతున్నాయి.

"వీళ్ళిద్దరికీ నిముషం పడదు" అంది రుక్మిణి

సావిత్రితో.

"అదంతా ఒట్టొట్టి పోట్లాటలే! ఒకళ్ళంటే ఒకళ్ళకు ఎంతప్రేమో. క్షణం వదిలి ఉండరు. ఆ మధ్య మా ఉదయ్‌కు జ్వరం వస్తే మీ మానస ఎంతగా విలవిల్లాడి పోయిందనీ. ఎప్పుడూ వాడిపక్కనే కూర్చుని సేవలు చేసేది" అంది సావిత్రి.

"మీ ఉదయ్ మాత్రం - మా మానస కంట్లో నలకబడ్డా పెద్ద హడావుడి చేస్తాడు..." అంది రుక్మిణీ.

"వీళ్ళిద్దరూ ఒకళ్ళ కోసమే ఒకళ్ళు పుట్టినట్లు అనిపిస్తుంది. ఈ బంధాన్ని శాశ్వతం చేయాలంటే వీళ్ళిద్దర్నీ 'భార్యాభర్తల్నీ' చేయాలి."

సావిత్రి మాటలకు చిరునవ్వుతో
"ఆ అలోచన నాకూవచ్చింది. జీవితాంతం వాళ్ళిద్దరూ ఇలా కలిసిమెలిసి ఉండాలంటే అదే మంచి మార్గం. ఇంతగా కలిసిపోయిన వీళ్ళను వేరుగా మనం ఊహించను కూడా ఊహించలేం" అంది రుక్మిణీ ధృఢనిశ్చయంతో.

ఆ సంభాషణ జరిగిన మరుక్షణమే మానసను తనకోడలిగా ఊహించుకుని సావిత్రి, ఉదయ్‌ను తన అల్లుడిగా ఊహించుకుని రుక్మిణీ.. ఈస్టమన్ కలర్‌లో 'పెళ్ళి, పేరటం' 'సీమంతం', 'బాలసారే ఒకదానివెంట ఒకటి సినిమా చూసినట్లు చూసేస్తున్నారు.

* * *

ఆరోజు 'మానస', 'ఉదయ్' లకు పెళ్ళి విషయం చెప్పాలని రుక్మిణీ, సావిత్రి నిర్ణయించుకున్నారు.

తాము చెప్పే విషయం వినగానే వాళ్ళ హావభావాలు ఎలాగుంటాయో కూడా ఊహించేసుకున్నారు.

ఏదో ఒకరోజు మీరిలా అడుగుతారని మాకెప్పుడో తెలుసు ఇదేం కొత్తవిషయం కాదు. మా మనసుల్లో, మీ మనసుల్లో ఇన్నాళ్ళు గుప్తంగా ఉన్న ఆలోచన ఒక్కటే. ఇది ఓపెన్ సీక్రెట్! అన్నట్లు ఏమాత్రం ఆశ్చర్యపోకుండా ముసిముసి నవ్వులు నవ్వుతాడేమో ఉదయ్ అనుకుంది సావిత్రి.

మానస ఎంతైనా ఆడపిల్లకదా సిగ్గుతో తలవంచుకుని తుర్రున బయటికి పరుగెత్తుతుందేమో అనుకుంది రుక్మిణీ.

ఇప్పటిలా వాగ్యుద్ధాలు చేయకుండా ఇకనుండి మౌనంగా గంభీరంగా మారిపోతారు ఇద్దరూ.

ఎదుటబడటానికి 'సిగ్గు, బిడియాలు' అడ్డువచ్చి ఇక ఎవరి గదుల్లోనుండి వారు బయటకు అడుగు పెట్టరేమో! అనుకున్నారు.

* * *

"మానసా! ఈ సంవత్సరంతో నీ డిగ్రీ పూర్తవుతుంది. ఈ ఎండాకాలం నీపెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నాం ఉదయ్ వాళ్ళ తల్లిదండ్రులు కూడా తొందరపడుతున్నారు" అంది రుక్మిణీ.

చదువుతున్న పుస్తకంలోనుండి తలపైకెత్తి తల్లి మాటలు అర్థంకానట్లు చూస్తూ "ఉదయ్ వాళ్ళ పేరెంట్స్ నా పెళ్ళికోసం తొందరపడటం ఏమిటి?" అంది మానస.

అది కావాలని వేసిన చిలిపి ప్రశ్నగా భావించి 'పెళ్ళికొడుకు గనుక అంటే నీ కాబోయే మొగుడి తల్లిదండ్రులు గనుక' అంది రుక్మిణీ. కలలో కూడా ఊహించని హఠాత్ సంఘటన ఏదో జరిగినట్లు వినకూడని వార్త ఏదో విన్నట్లు అదిరిపడింది మానస!

"అమ్మా! ఏమిటి నువ్వంటున్నది? ఉదయ్‌ను నేను పెళ్ళి చేసుకోవడమేమిటి?" కూతురి ప్రశ్నలో తొంగిచూస్తున్న అమాయకత్వం, పసిహృదయం ఈసారి రుక్మిణిని ఆశ్చర్యపోయేలా చేసింది.

"అదేమిటే అలా అంటావ్. నువ్వు, ఉదయ్ కాబోయే భార్యాభర్తలని చిన్నప్పటినుండీ అనుకుంటున్నాం."

"మీరు అనుకున్నారేమో - మేమెప్పుడూ అలా అనుకోలేదు."

"వయసులో ఉన్న మీరిద్దరూ... అలా చనువుగా తిరగటం ఒకళ్ళంటే ఒకళ్ళు ప్రేమగా ఉండటం? ఒకరికేదైనా కష్టమొచ్చిందంటే మరొకరు విలవిలలాడి పోవడం దీనికి అర్థం ఏమిటి?"

"అర్థాలు, వ్యాఖ్యానాలు నాకు ఏమీ తెలియవు. నాకు తెలిసిందల్లా ఒక్కటే. నాకు ఉదయ్ అంటే ప్రేమ, ఇష్టం. అతనికి ఏ కష్టం వచ్చినా నేను భరించలేను.

"చిన్నప్పటినుండీ ఆడుతూ, పాడుతూ ఒకచోట తిరిగిన ప్రాణస్నేహితులం మేమిద్దరం అంతే!"

"ఉదయ్‌ను నా భర్తగా నేనెప్పుడూ ఊహించుకోలేదు."

"అతన్ని చూస్తుంటే అసలు నాకాభావం ఎప్పుడూ కలగలేదు. ఎందుకు కలగలేదని నువ్వు ప్రశ్నిస్తే నా దగ్గర సమాధానం లేదు" అంది మానస. ఆమె మాటల్లో ధృఢనిశ్చయం, గాంభీర్యం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"నీకేమైనా పిచ్చి పట్టిందా? అతనితో ఇన్నాళ్ళూ చనువుగా తిరిగావ్. వయసులో ఉన్న ఓ ఆడపిల్ల, ఓ మగపిల్లవాడు అలా తిరిగితే... లోకం హర్షిస్తుందా? అపనిందలపాలు చెయ్యదూ?"

**పరీక్ష**

పెళ్ళిచూపుల కార్యక్రమం ముగిసింది.
"అబ్బాయి తండ్రి ప్లేట్లోని స్వీట్స్ వెంట తీసుకెళ్ళాడేమిటండీ?!" అనడిగింది శారదాంబ భర్తని.
"ఆయన హెల్త్ ఇన్స్‌పెక్టర్ కదా... టెస్ట్ చెయ్యందే తినడట"

— డి. లక్ష్మీనారాయణ, తెనాలి

"స్నేహితునితో సరదాగా సినిమాకు, షికారుకు వెళ్ళితే తప్పేమిటమ్మా? ఉదయ్ పక్కన నిల్చున్నా అతన్ని స్పర్శించినా నాలో ఎలాంటి వికారాలు కలగ లేదు ఎప్పుడూ. నాలో కలగని భావాలను బలవంతాన నామీద రుద్ది ప్రపంచంలో ఇలాంటి బంధం తప్ప మరో బంధం ఉండకూడదన్నట్లు మాట్లాడతావేమిటి?"

"ఉదయ్, నేను మంచి స్నేహితులం అంతే! అంతకు మించి మరే ఉద్దేశంలేదు."

"ఇన్నాళ్ళూ అతనితో అంత చనువుగా తిరిగి ఇప్పుడు 'ఆ ఉద్దేశం లేదంటే' లోకం ఎలా నమ్ముతుందే? నిన్ను పెళ్ళి చేసుకోవటానికి మరోవ్యక్తి ముందుకెలా వస్తాడు?" ఆందోళనగా అంది రుక్మిణీ.

"ఒక స్నేహితునితో చనువుగా ఉన్నంత మాత్రాన లోకం అలా ఊహిస్తుందని నాకు ఇన్నాళ్ళూ తెలియదు. ఉదయ్ పట్ల నాకు ఆ ఆలోచనే లేనప్పుడు లోకం అలా అనుకుంటుందని నేనెలా ఊహించగలను? లోకం కోసం బలవంతాన మీరు నన్ను ఉదయ్‌కు కట్టబెట్టినా మీరు అనుకునే భార్యాభర్తల సంబంధం మామధ్య ఉంటుందనుకోవడం మాత్రం కల్ల. మా ఇద్దర్నీ ఒక గదిలో పడేసి ఎన్నిరాత్రులు మీరు బంధించినా.. ఇప్పుడెలా ఉన్నామో అలాగే ఉంటాము" తన నిర్ణయానికి తిరుగులేదన్నట్లు, 'ఇక ఈవిషయంలో వాదించడం తనకు అసహ్యం' అన్నట్లు చరచరా అక్కడినుండి బయటికి వెళ్ళిపోయింది మానస.

అర్థంకాని ఆ విచిత్ర బంధాన్ని తలపోస్తూ అలాగే అయోమయంలో పడిపోయింది రుక్మిణి.

* * * *

"ఏమిటమ్మా! నువ్వంటున్నది. మానసకు, నాకు పెళ్ళా!" ప్రపంచంలో ఎనిమిదవ వింత ఏదో జరగబోతున్నట్లు ఆశ్చర్యపోయాడు ఉదయ్.

"ఎందుకురా? అంతగా ఆశ్చర్యపోతావ్! చిన్నప్పటి నుండి అనుకుంటున్నదేగా?"

"కానీ... నేనూ మానస ఎప్పుడూ అలా అనుకోలేదే?! అసలు ఆ ఆలోచనే మాకు ఎప్పుడూ రాలేదు".

"అంటే 'మానస'ను నీ చెల్లెలిగానే భావించానంటావా?" సీరియస్‌గా ప్రశ్నించింది సావిత్రి.

ఆ ప్రశ్నకు పక్కున నవ్వాడు ఉదయ్.

"ఇదేదో సినిమాలో సీన్‌లా ఉందమ్మా అచ్చం. ఓ అమ్మాయి, ఓ అబ్బాయి చనువుగా ఉండటం. అదిచూసి ఆ అమ్మాయి భర్తో లోకమో అనుమానించడం. 'అబ్బే! నాకా ఉద్దేశ్యం ఎప్పుడూలేదు. ఈమెను నా చెల్లెలిగా భావిస్తున్నాను' అని హీరోనో, సైడ్ హీరోనో ఒక బరువైన డైలాగ్ చెప్పడం ఇదో సీను. ప్రేక్షకుల హృదయాలు కరిగి నీరై సినిమా థియేటర్ అంతా ప్రవహిస్తాయిఈ టచింగ్ సీన్‌తో".

"ఏమిటిరా నీ పిచ్చిధోరణి?" చిరాకుగా అంది సావిత్రి.

"లేకుంటే ఏమిటమ్మా. ఏదో ఒక చుట్టరికం ఉంటే తప్ప ఓ అబ్బాయి, అమ్మాయి చనువుగా ఉండకూడదా?

"మానస నా చెల్లెలు' అని నా నోటితో చెప్పందే మా బంధాన్ని హర్షించదా ఈ లోకం. ఈ ప్రపంచంలో మనిషికీ మనిషికీ మధ్య ఉన్న ఎన్నో బంధాలలో ఒకటి స్నేహబంధం. నేను, మానస మంచి స్నేహితులం. ఎలాంటి వికారాలు లేని మా స్నేహానికి 'వయసు, లోకం' ఇవేమీ అడ్డురావు". కడిగిన ముత్యంలాంటి స్వచ్ఛమైన హృదయంతో నిశ్చలంగా అన్నాడు ఉదయ్.

"నీకు అడ్డురాకపోవచ్చురా! నీకేం నువ్వు మగాడివి. కానీ మానస ఆడపిల్ల. మీ ఇద్దరి చనువు తెలిసిన ఎవరు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటారు?"

"మానసకు కాబోయే మొగుడి అర్హతలు తెలుసుకోవాలంటే మా స్నేహమే ఒక గీటురాయి అమ్మా! స్నేహాన్ని స్నేహంగా భావించి హర్షించలేని కుసంస్కారి మానస భర్తకావటం నేనేమాత్రం భరించలేను. మానస భర్త గొప్ప సహృదయుడు, ఉన్నతుడు కావాలి".

అర్థమయ్యీ, అర్థం కానట్లున్న అతని ధోరణి సావిత్రికి చికాకు కలిగించింది.

అతని మొండివాదన, దృఢనిశ్చయం మాత్రం అర్థమై ఇక తను ఏం చెప్పినా లాభంలేదని మాత్రం తెలుసుకుంది.

* * * *

మానస పెళ్ళి సుమన్‌తో నిశ్చయమైంది. అందగాడు, ఆజానుబాహుడు, ఠీవి, దర్పం గలవాడు అయిన సుమన్ అందర్నీ ఇట్టే ఆకర్షించాడు.

చదువు, సంస్కారం, ఆదర్శభావాలు గల సుమన్ మానస భర్త కావటం ఎంతగానో నచ్చింది ఉదయ్‌కు. పెళ్ళి పందిరిలో ఎక్కడ చూసినా తనే అయి అందరికీ అన్నీ అమరుస్తూ హడావుడి చేసాడు.

మధ్య మధ్య వీలుదొరికినప్పుడల్లా మానసను సుమన్‌ను ఆటలు పట్టిస్తూ నవ్వుతూ అందర్నీ నవ్విస్తున్నాడు.

పెళ్ళిపీటలమీద కూర్చుని తలంబ్రాలు పోస్తూ ఓసారి పెళ్ళికొడుకు వంక చూసింది మానస.

అదే సమయంలో చిలిపిగా నవ్వుతూ కొంటెగా పెళ్ళికూతురి వంక చూసాడు సుమన్. నాలుగు కళ్ళూ కలుసుకున్నాయి

మానస ఏదో అద్భుత అనుభూతికి లోనయింది.

పాణిగ్రహణమప్పుడు తన చేతిని అతను తన చేతితో పట్టుకోగానే నరనరాల్లో ఓ తీయటి అనుభూతి జలజలా పాకింది.

మనసంతా ఓ వింత పులకింతతో, శరీరమంతా చెప్పలేని కొత్త కోర్కెలతో నిండిపోయింది.

విశాలమైన అతని వక్షస్థలం మీద, లతలా తనను పెనవేసుకున్న ఆ దీర్ఘ బాహువుల మధ్య గువ్వలా ఒదిగిపోవాలన్న కోర్కె—

భేరీనాదంలాంటి గంభీరమైన కంఠం విప్పి అతను తనతో ఏదో చిలిపిగా అంటుంటే, సిగ్గుల మొగ్గల్లా, మాటలురాని మల్లియలా ముడుచుకుని పోవాలన్న ఆశ—

ఇలాంటి ఆలోచనలు, కోర్కెలు ఉదయ్‌ను చూస్తున్నప్పుడు తనలో ఏనాడూ కలగలేదు ఎందుకని?

ఎన్నోసార్లు అతని చేయి పట్టుకుంది. భుజంమీద చెయ్యివేసి స్కూటర్ మీద వెనక కూర్చుంది. అప్పుడు ఇలాంటి 'స్పర్శసుఖం' తనలో ఏమాత్రం కలగలేదు.

మగవాడికుండాల్సిన లక్షణాలన్నీ అతనికీ ఉన్నాయి. అయినా ఎప్పుడూ ఇలాంటి కోర్కెలు కలగలేదు. ఇలాంటి ఆకర్షణ ఏనాడూ ఎరగదు.

ఉదయ్ అంటే ఇష్టం, ప్రేమ.

శారీరక సుఖాలను ఆశించని కేవలం హృదయ సంబంధమైన సఖ్యప్రేమ అది.

హృదయంలో ఎన్నో అరలుంటాయి.

ఈ అనంత జీవన పయనంలో ఎదురయ్యే ఎందరో వ్యక్తులు, ఎన్నోరకాల ప్రేమలు! ఒక్కోదానికోసం ఒక్కో అర కేటాయించబడుతుంది. తల్లి, తండ్రి, ప్రియురాలు, పిల్లలు, స్నేహితులు ఇలా ఎందరో... ఎన్నిరకాలో? ఏ ప్రేమకూ నోచుకోని జీవితాలకు ఈ ప్రపంచమే శూన్యంగా, రసహీనంగా కనిపిస్తుంది.

ప్రేమైక జీవితం నందనవనంలా అందంగా రసభరితంగా కనిపిస్తుంది.

హృదయసంబంధమైన ఈ ప్రేమతత్వాన్ని అర్థం చేసుకోలేక ఎంతోమంది ఏవేవో అపోహలు పడుతుంటారు.

వాటి ఫలితమే అపనిందలు.

ఒక స్త్రీ, ఒక పురుషుడు కలిసి స్నేహం చేస్తే... దానికవేవో తప్పుడు కథలల్లి... మానసికంగా వాళ్ళను చిత్రహింస చేయడం ఈ లోకానికి అలవాటు. చివరకు అవి బలవంతపు పెళ్ళిళ్ళు, ఇష్టంలేని పెళ్ళిళ్ళుగా మారి జీవితాన్ని నరకం చేస్తాయి. అపనిందలకు భయపడే స్త్రీ చెయ్యని నేరానికి సమాజం ముందు దోషిలా తలవంచవలసివస్తుంది. సమాజం శాసించిన, నిర్ణయించిన జీవితంతో రాజీపడి బ్రతుకుతుంది.

ఫలితం అసంతృప్తి, రసహీనమైన సంసారం చావలేక బ్రతుకుతున్న బ్రతుకు.

అలాంటి సమస్యల వలయంలో తను ఇరుక్కోకుండా మనసులోని మాట ధైర్యంగా చెప్పి జీవితాన్ని తనకు నచ్చిన పద్ధతిలో తను నిర్ణయించుకోగలిగినందుకు తనను తానే అభినందించుకుంది మానస.

సుమన్ మంచివాడు, మనసున్నవాడు, విశాల హృదయుడు.

అతని సాహచర్యంలో తన జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుంది.

'ఇంతకన్నా ఈ జీవితానికి కావలసింది ఏముంది?' అనుకుంది మానస తృప్తిగా

* * * *

విజయవాడ రైల్వే ప్లాట్‌ఫాం చాలా హడావుడిగా, సందడిగా ఉంది.

సూట్‌కేస్, బుట్ట, వాటర్‌బ్యాగ్‌లతో ఎక్కవలసిన రైలుకోసం ఎదురుచూస్తూ నిల్చొని ఉన్నారు మానస, సుమన్.

తిరుపతిలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్ళి, హైద్రాబాదుకు తిరుగు ప్రయాణంలో రైలు మారవలసి వచ్చి అక్కడ విజయవాడ ప్లాట్‌ఫాం మీద నిల్చొని ఉన్నారు.

మాటిమాటికీ వాచీవంక అసహనంగా చూసుకుంటున్నాడు సుమన్.

పైట నిండుగా భుజాలమీద కప్పుకొని భర్త పక్కనే నిల్చుని ఉంది మానస.

ఇంతలో వెనకనుండి, ఎవరో భుజంమీద గట్టిగా తట్టినట్లు అనిపించింది.

> **గొడవ**
>
> సరిత: మళ్ళీ ఏ వెధవతో గొడవ పడ్డావురా... ఏడుస్తున్నావ్?
>
> బాబు: నాన్నతో...
>
> — డి. లక్ష్మీనారాయణ, తెనాలి

ఉలిక్కిపడి బెదురుగా గిర్రున వెనక్కు తిరిగింది మానస. ఎదురుగా ఉదయ్.

మానస ఆనందంతో, ఆశ్చర్యంతో తబ్బిబ్బయ్యింది.

"ఏయ్! ఉదయ్! నువ్విక్కడికెలా వచ్చావ్? అబ్బ! ఎన్నాళ్ళయింది నిన్ను చూచి?!"

అతని రెండు చేతులను తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కుతూ అంది మానస.

మానసను చూసిన ఆనందంలో తలమునకలవుతూ తన్నుతాను మరచిన ఉదయ్... ఆ ఉద్వేగం తగ్గిన తర్వాత ఈ లోకంలోకి వచ్చి "హలో! హౌఆర్‌యూ?" అని సుమన్‌తో కరచాలనం చేసాడు.

"ఏమిటి విశేషాలు?" అంది మానస.

"ఏముంది? నువ్వు పెళ్ళి చేసుకుని మీ ఆయనతో దూరంగా వెళ్ళిపోయావు. నాకెంత బోర్ కొడుతోందో తెల్సా?"

"అందుకే నువ్వుకూడా పెళ్ళి చేసుకో! ఎంచక్కా మీ ఆవిడతో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయవచ్చు"

"ఎంతైనా ఫ్రెండ్ ఫ్రెండే. ఆవిడ ఆవిడే" అన్నాడు ఉదయ్.

ఇంతలో సుమన్ అందుకుంటూ

"ఎంతైనా ఫ్రెండ్ ఫ్రెండే. ఆయన ఆయనే" అన్నాడు. ఉదయ్, మానస పక్కున నవ్వారు.

సుమన్ రైలు త్వరగా వస్తే బాగుంటుందని చూస్తున్నాడు కబుర్లలో పడ్డ ఉదయ్, మానసలకు కాలమే తెలియటం లేదు.

ఇంతలో రైలు వచ్చింది.

'హమ్మయ్య' అనుకున్నాడు సుమన్.

'ఎప్పుడూ గంటల తరబడి లేటొచ్చే రైళ్ళు ఈ రోజెందుకో ఏదో కొంప మునిగిపోతున్నట్లు పరుగెత్తుకొని వచ్చినట్లు అనిపించింది ఉదయ్, మానసలకు.

ఉదయ్ దగ్గర వీడ్కోలు తీసుకొని మానస, సుమన్ రైలెక్కారు.

ఉదయ్ కనిపించేవరకు చెయ్యి ఊపుతూనే ఉంది మానస.

"పడిపోతావ్! లోపలికొచ్చెయ్" అన్నాడు సుమన్.

ఆ రాత్రి భర్త పక్కన చేరి... ముఖానికి పుస్తకం అడ్డం పెట్టుకుని చదువుతున్నట్లు నటిస్తున్న భర్తతో

"లైట్ ఆర్పనా?" అంది మానస.

"ఊ!" అన్నాడు సుమన్

లైటు ఆర్పి లతల్లాంటి తన చేతులతో భర్తను చుట్టేసింది మానస.

కానీ అతని దగ్గరినుండి 'రెస్పాన్స్' రాలేదు.

ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయినట్లు కనిపించాడు.

"మనూ! నిన్నో విషయం అడుగుతాను. దాచకుండా నిజం చెబుతావా? ఆ నిజం ఎలాంటిదయినా భరించగల శక్తి నాకుంది" అన్నాడు సుమన్.

భర్త కంఠంలోని ఆ సీరియస్‌నెస్‌కు ఆశ్చర్యపోయింది మానస.

అప్రయత్నంగానే కౌగిలి పట్టు బిగిసింది.

"ఏమిటండీ అది?" వణుకుతున్న కంఠంతో అంది.

"ఉదయ్‌కు, నీకూ మధ్య నిజంగా ఎలాంటి సంబంధం లేదా?" ఒకరి చేతులొకరు పట్టుకుని లోకం మరచి కబుర్లాడుకుంటున్న ప్లాట్‌ఫారంమీది ఆ దృశ్యం కళ్ళల్లో మెదులుతుండగా అన్నాడు సుమన్.

మానసకు అకస్మాత్తుగా, తను పాతాళంలోకి కూరుకొని పోతున్నట్లుగా అనిపించింది.

తను నిర్మించుకున్న ఆశల సౌధాలు పునాదులతో సహా పగిలి భూమిమీద వాలిపోతున్నట్లు అనిపించింది. ఉత్తముడు, ఉన్నతుడు అనుకున్న భర్త సైతం ఒక సామాన్యుడిలా, సంకుచిత సమాజానికి ప్రతినిధిలా తనను నిలేసి ప్రశ్నిస్తూంటే ఏం సమాధానం చెప్పగలదు తను?

ఉదయ్‌కు తనకు మధ్య ఉన్న సంబంధం ఎలాంటిదో ఎలా ఋజువు చేయగలదు? ప్రేమించే హృదయం ఉండాలిగానీ ప్రేమమయమైన ఈ జగత్తులో రకరకాల ప్రేమలు దృగ్గోచరమౌతాయని అమ్మ, చెల్లి, భార్య, పిల్లలు ఈ బంధాలలాగానే స్నేహితురాలు కూడా ఒక బంధమనీ, దాన్ని సఖ్యప్రేమ అంటారని వీళ్ళకు తెలియదా?' అనుకుంది మానస.

ఆమె మనసంతా మూగవేదనతో కుమిలిపోయింది. 'హృదయసంబంధమైన కొన్ని అనుభూతులకు, అనుభవాలకు భాష ఉండదు. స్పందించే మరో హృదయమే ఆ భావనను అనుభవించగలదు. ఒకేరకం ఆలోచనలకు, దృక్పథానికి అలవాటుపడిన ఈ లోకం మానస, ఉదయ్‌ల అమలిన ప్రేమను ఎలా అర్థం చేసుకోగలదు?

---

రచయిత్రి చిరునామా:
**కొఠారి వాణీ చలపతిరావు**
16-12/1 కోదండరామనగర్
దిల్‌సుఖ్‌నగర్, హైద్రాబాదు - 500 660